క్లుప్తంగా

పలువురికి జరిమానా

రామన్నపేట: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడుతూ పట్టుబడిన ఇద్దరు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 8 మందికి రూ.17,800 జరిమానా విధించినట్లు వివరించారు.

వాహన తనిఖీలు



మామునూరు: మద్యానికి బానిసై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులు డ్రైవింగ్ లైసెన్స్ లేని తమ పిల్లలకు వాహనాలను ఇవ్వొద్దని ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో మామునూరు ఎస్సైలు కృష్ణవేణి, శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పర్యవేక్షణలో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలను నడపడం నేరమని, హెల్మెట్ లేకుండా బైక్‌లు నడపొద్దని అన్నారు. కారు నడుపుతున్నప్పుడు తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలని పేర్కొన్నారు.

ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డు గ్రహీతకు సన్మానం



కాజీపేట: ఆంధ్రప్రదేశ్ నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రపంచ ఫొటోగ్రఫీ పోటీల్లో కొమురవెల్లి మల్లన్న జాతరలో పసుపు జాతర అనే అంశంపై తీసిన ఫొటోకు ఉత్తమ ఫొటో అవార్డు దక్కింది. కాజీపేట పట్టణానికి చెందిన పిల్లి అనిల్‌కుమార్ తీసిన చిత్రం ఎంపిక కావడంతో ఆయనను బంధు, మిత్రులు గురువారం సన్మానించారు. వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టంగుటూరి రాజేష్ ఖన్నా పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

భద్రుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కెమిస్ట్రీ విభాగం పరిశోధకుడు భూక్యా భద్రుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. స్టడీస్ ఆన్ సింథసిస్ అండ్ బయాలజికల్ యాక్టివిటీస్ ఆఫ్ నోవెల్ ఫ్యూస్డ్ పైరిడిన్ హెటిరోసైక్లెస్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ న్యూ సింథటిక్ మెథడాలజీస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల విభాగం అధికారులు తెలిపారు. కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ హనుమంతు పర్యవేక్షణలో భూక్యా భద్రు తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

నియామకం



హన్మకొండ: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చంటి ముదిరాజ్‌ను నియమించారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



హన్మకొండ: హనుమకొండ వెంకటేశ్వర కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నీలిమ దంపతులు గురువారం దర్శించుకున్నారు. తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు.

జర్నలిస్టుకు ఘన నివాళి



నయీంనగర్: సీనియర్ జర్నలిస్ట్ సిరిపురం తిరుపతిరెడ్డి మృతదేహానికి హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, ప్రెస్ క్లబ్ బాధ్యులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు గురువారం నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి కొండా మురళీధర్‌రావు రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించి, డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయిస్తామని ప్రకటించారు. నివాళులు అర్పించిన వారిలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు దాసరి కృష్ణారెడ్డి, గడ్డం రాజిరెడ్డి, పిన్న శివకుమార్, బీఆర్.లెనిన్, మస్కపురి సుధాకర్, జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి ఓ చోట.. తవ్వకాలు మరో చోట



క్వారీకి వెళ్లే దారి



అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీ

- దర్జాగా మొరం అక్రమ దందా
- పట్టాదారుడి ఫిర్యాదుతో వెలుగులోకి..

హసన్‌పర్తి: అనుమతి ఓ చోట పొంది.. మరో చోట తవ్వకాలు చేపడుతూ మొరం అక్రమ వ్యాపారానికి తెరలేపారు. ఈ ఘటన హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లిలో వెలుగు చూసింది. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు పట్టాదారు, ఆ గ్రామ మాజీ సర్పంచ్ మేడిపల్లి మధన్‌గౌడ్ ఫిర్యాదు చేశారు. విచారణ జరపాలని కోరగా, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి మొరం తవ్వకాలను నిలిపివేశారు.

అనుమతి లేని చోట తవ్వకాలు

మల్లారెడ్డిపల్లి శివారులోని సర్వే నంబర్ 243లో మొరం తవ్వకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును పరిశీలించి కేవలం 25 గుంటల సేకరణకు అధికారులు అనుమతి ఇచ్చారు. నెల రోజుల క్రితమే క్వారీకి అనుమతి లభించింది. అనుమతి పొందిన సదరు వ్యాపారి సర్వే నంబర్ 243లో కాకుండా పక్కనే ఉన్న సర్వే నంబర్ 241లో తవ్వకాలు చేపట్టాడు. పట్టాదారుడి ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో తవ్వకాలు నిలిపివేయడానికి వెళ్లిన రెవెన్యూ అధికారులు.. అనుమతి పొందిన స్థలంలో కాకుండా వేరేచోట పెద్ద ఎత్తున మొరం తవ్వకాలు చేపట్టినట్లు గుర్తించారు. కాగా, ఏడాది నుంచి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని అధికారులకు స్థానికులు వివరించారు. ఇప్పటికే కోట్లాది రూపాయల విలువైన మొరం తరలివెళ్లినట్లు ప్రజలు తెలిపారు.

ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం



ఖిలా వరంగల్: మాట్లాడుతున్న నరసింహ

ఖిలా వరంగల్: తెలంగాణ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ప్రపంచ జానపద వేడుకలను గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రజానాట్య మండలి ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ మాట్లాడుతూ జానపద కళాకారులకు నంది అవార్డులు ఇవ్వాలని, వారిని ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మీనారాయణ, కేతరాజు ఉప్పలయ్య, చంద్రశేఖర్, కృష్ణ, గన్నారపు రమేష్, సుప్రియ, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

జానపద కళల్ని కాపాడాలి

వరంగల్ చౌరస్తా: ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ రైల్వే స్టేషన్‌రోడ్డులోని బాపూజీహాల్‌లో కళాకారులను గురువారం సన్మానించారు. సకల కళా సాంస్కృతిక మండలి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాకారులు లింగాల ఇమ్మానుయల్, గడ్డం శరత్, తోట రవి, సమ్మక్క, అమ్మ కుమార్, అగస్టీన్, కరుణాకర్ నరసింహస్వామి, కుమార్, కుంట ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి ప్రత్యేక పూజలు



మడికొండలో..



కాజీపేటలో..

మడికొండ: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని కాజీపేట మండలం మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి దేవాలయంపై ఉన్న విజయగణపతి ఆలయంలో గురువారం పంచామృతాభిషేకాలు, గరికలతో విశేష అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి కే.శేషుభారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, బోగి కేదారి, జ్ఞానేశ్వరి, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్వేతార్కుడు

కాజీపేట: సంకటహర చతుర్థి వేడుకలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో గురువారం స్వామివారికి ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో గోదావరి నదీ జలాలతో పాటు సప్తవర్ణ అభిషేకాలను అర్చకులు నిర్వహించారు. ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణశర్మ గణపతి హోమం చేయించారు.

సంక్షిప్తంగా

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

హసన్‌పర్తి: విద్యార్థులు ఇష్టంతో చదవాలని కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి సూచించారు. కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు గురువారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించడానికి స్వీయ ప్రేరణతో సొంత ప్రణాళికను రూపొందించుకోవాలని చెప్పారు. అలాగే, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ వేణుమాధవ్, రిజిస్ట్రార్ కోమల్‌రెడ్డి, ప్రొఫెసర్ సుధీర్‌రెడ్డి, ప్రొఫెసర్ రాజగోపాల్, ప్రొఫెసర్ వెంకటేష్, డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో అండగా ఉంటాం

ఖిలా వరంగల్: ఎవరైనా అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితిలో ఉంటే రక్తదానం చేసి అండగా నిలుస్తామని మెగా ఫ్యామిలీ అభిమాన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు, అఖిల భారత చిరంజీవి అభిమాన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు కరాటే ప్రభాకర్ తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల్లో భాగంగా శివనగర్‌లోని భూపేష్‌నగర్‌లో సామాజిక వేత్త కొయ్యడ సంగీత్‌రాజ్ గౌడ్ ఆధ్వర్యంలో సినీ హీరో చిరంజీవి జన్మదిన వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మొక్కలు నాటారు. ఫణి, రాము, రతన్‌గౌడ్, రవి, రమేష్, చిరంజీవి, మణికంఠ, లక్ష్మణ్, చందు పాల్గొన్నారు.

ఒక చిత్రంలో వేల మాటలు

కాజీపేట రూరల్: ఒక చిత్రంలో వేల మాటలు ఉంటాయని, అనేక భావాలు కనిపిస్తాయని, ఆర్ట్ గ్యాలరీలోని ఒక్కో చిత్రం ఒక్కో ఆణిముత్యమని హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ 70వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని గురువారం ఆయన ప్రారంభించారు. రిటైర్డ్ కస్టమ్స్ ఆఫీసర్ ఆర్. నాగనాథ్, పూణే ప్రావీన్స్ హెడ్ రెవరెండ్ బ్రదర్ జైకో గర్వాసిస్, గాబ్రియల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని పాలిశెట్టి, బ్రదర్ స్లీవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుడు నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవాలి

కాజీపేట రూరల్: కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న రైల్వే కార్మికుడు పి.నాగరాజు గురువారం మృతి చెందినట్లు రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు తెలిపారు. కాజీపేట నార్త్ ఎస్ఎస్ఈపీ ఇంజనీరింగ్ కార్యాలయం యూనిట్ నంబర్ 1లో సుమారు 36ఏళ్లు పనిచేసి అనారోగ్య కారణాల వల్ల వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని రెండు నెలలు అవుతోందని, ఇంకా రైల్వే బెనిఫిట్స్ రాలేదని తెలిపారు. ఆర్థిక పరిస్థితుల వల్ల సొంత ఇల్లు కూడా లేదని అన్నారు. రైల్వే శాఖ అధికారులు మానవతా దృక్పథంతో నాగరాజు కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

కొత్వాల్ బహదూర్ జయంతి



హసన్‌పర్తి: హైదరాబాద్ రెడ్డి హాస్టల్ వ్యవస్థాపకుడు, సంఘ సంస్కర్త కొత్వాల్ బహదూర్ వెంకట్రామిరెడ్డి జయంతి వేడుకలను నగరంలోని ఒకటో డివిజన్ ముచ్చర్ల గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాంరెడ్డి, చిర్ర శ్రవణ్, సతీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీఓస్ కేంద్ర సంఘం నేతలకు సన్మానం

హన్మకొండ అర్బన్: హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీఓస్ భవన్‌లో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌ను టీఎన్జీవోస్ యూనియన్ హనుమకొండ జిల్లా నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, నాయకులు మొయిజ్, లక్ష్మీప్రసాద్, రాజేష్‌ఖన్నా, గౌతమ్, లక్ష్మణ్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మడికొండ: 64వ డివిజన్ మడికొండ గ్రామానికి చెందిన ధరావత్ సునీల్ (50) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను గురువారం పలువురు పరామర్శించారు. పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, మార్తినేని ధర్మారావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, డివిజన్ అధ్యక్షుడు దువ్వ నవీన్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు గడ్డం మహేందర్, నాయకులు పొనగోటి వెంకట్‌రావు, బన్న ప్రభాకర్, ఆకుల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సెల్ చైర్మన్‌కు అభినందన

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్, న్యాయవాది శివనగర్‌కు చెందిన శామంతుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ ఉప్పశ్రీపద్మను వరంగల్ 34వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో రావుల విజయ రాంచందర్, పట్టూరి సుధాకర్, రాధిక, ముత్తినేని మధు, విజయ్, రాజేష్, వెంకన్న, శ్రీధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



కదలని మురుగు

గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్ పోచమ్మకుంట యూపీహెచ్‌సీ స్లమ్ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదు. దాంతో దుర్వాసనతో స్థానికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - నయీంనగర్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
బి.నరేందర్, శానిటరీ సూపర్‌వైజర్
ఫోన్‌నంబర్: 76808 88379

హెల్ప్‌డెస్క్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

హన్మకొండ అర్బన్ : రుణమాఫీ కాని రైతులు ఆయా మండలాలు, జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లలో సమర్పించిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసి త్వరగా పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య.. అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లతో రుణమాఫీపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రుణమాఫీ కానీ రైతులు ఈ హెల్ప్‌డెస్క్‌లలో దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతరాయం కొనసాగే ప్రక్రియని, దీనికి ఆఖరి తేదీ అంటూ లేదని తెలిపారు. నేటి (శుక్రవారం)నుంచి నాలుగు రోజులు పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి హెల్ప్‌డెస్క్‌లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తారని చెప్పారు. మండల వ్యవసాయ అధికారులు షెడ్యూల్ తయారు చేసుకొని దాని ప్రకారం ఏ గ్రామం వెళుతున్నారో ముందుగానే అక్కడి రైతులకు తెలియజేయాలన్నారు. వారిని ఒక ప్రదేశానికి రప్పించి పరిష్కరించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారులు బ్యాంకులనుంచి రుణమాఫీ అయినా వారి జాబితా తీసుకొని ఎవరైనా రెన్యువల్ కానీ రైతులు ఉంటే వారికి సమాచారం ఇచ్చి రెన్యువల్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు .బ్యాంక్ అధికారులు మిగిలిన ఖాతాలకు ఈ నెలాఖరులోగా రెన్యువల్స్ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 43,881మంది రైతులకు రుణమాఫీ జరగగా 21,426 మందికి రెన్యువల్ అయినట్లు వారికి రూ. 1741.12 కోట్లు జమ అయినట్లు తెలిపారు. అదేవిధంగా ఫర్టిలైజర్ సరైన నిల్వలు ఉన్నాయా లేదో తెలుసుకొని ఎరువుల వివరాలను తెలియజేయాలన్నారు. కావాల్సిన ఎరువులకు ఇండెంట్ పెట్టాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, బ్యాంక్ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ఫిర్యాదుల స్వీకరణ

హన్మకొండ: పంట రుణమాఫీ పథకం అమలుకు ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.రవీందర్ సింగ్ తెలిపారు. ఫిర్యాదులు స్వీకరించేందుకు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామని, మండల వ్యవసాయాధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించినట్లు పేర్కొన్నారు. హసన్‌పర్తికి ఎ.అనురాధ (72888 94718), హనుమకొండ (పలివేల్పుల) ఎ.శ్రీలత (72888 94717), కాజీపేట ఎం.సంతోశ్ (87902 68281) అందుబాటులో ఉంటారని వివరించారు. ఆయా రైతు వేదికల్లో ఉండే వీరికి ఫిర్యాదులు అందించవచ్చన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వడబోత



హసన్‌పర్తి: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వడబోత ప్రక్రియ ప్రారంభమైంది. ఈమేరకు ప్రత్యేక బృందం క్షేత్రస్థాయిలో దఖాస్తులను పరిశీలిస్తోంది. చింతగట్టు, భీమారం రెవెన్యూ ప్రాంతాల్లో నాన్‌లే ఔట్ ప్లాట్లు కొనుగోలు చేసి, ఎల్‌ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. సర్కార్, ఎస్సారెస్పీ, వక్ఫ్, దేవాదాయ, చెరువు శిఖంతో పాటు ఎఫ్‌టీఎల్, జఫర్‌జోన్‌లో కాకుండా నాలాల్లో ప్లాట్లు ఉంటే తిరస్కరించనున్నట్లు బృందం సభ్యులు వివరించారు. నాలుగేళ్ల క్రితం ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి సమాచారం ఇస్తూ వడబోత ప్రక్రియను చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

కుమారుడితో కలిసి వివాహిత అదృశ్యం

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌పరిధి వాటర్ ట్యాంక్ పెరకవాడకు చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ శాంతినగర్ పెరకవాడకు చెందిన గుముడవెల్లి శ్రీకాంత్, మౌనిక దంపతులకు రెండున్నర ఏళ్ల కుమారుడు ఉన్నారు. రోజువారిగా వ్యవసాయ మార్కెట్‌కు విధుల నిమిత్తం శ్రీకాంత్ వెళ్లాడు. విధులు ముగించుకుని తిరిగి సాయంత్రం వచ్చే సరికే కుమారుడితో పాటు మౌనిక కనిపించలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ఇన్స్పెక్టర్ వివరించారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

ఖిలా వరంగల్: ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తులపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ ఉప్పాలగుట్ట ప్రాంతానికి చెందిన జి.సురేష్ లారీ అసోసియేషన్ ఎన్నికల్లో సహకరించడం లేదని దుర్భాషలాతూ అతని ఇంటిపైకి బుధవారం అర్ధరాత్రి వెళ్లి వేముల భూపాల్, ఎండీ.జాకీర్, షేరీ సతీష్, రాజేష్ దాడి చేశారు. బాధితురాలు రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య వివరించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా సంచారం?



మడికొండ: అవగాహన కల్పిస్తున్న కిషన్

అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు

కాజీపేట: ఉత్తర భారతదేశం నుంచి అంతర్రాష్ట్ర దొంగల ముఠా పట్టణంలో సంచరిస్తున్నట్లుగా సమాచారం మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి సూచించారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే కుటుంబాలు తమ సమీపంలోని వారికి లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇళ్లలో విలువైన నగలు, నగదులు ఉంచుకోవద్దని అన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే 87126 85122, 87126 85008 నంబర్లకు ఫోన్ చేయాలని సీఐ కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మడికొండ: దొంగలు సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మడికొండ ఎస్‌హెచ్ఓ కిషన్ పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో ఉత్తరాది నుంచి వచ్చిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సంచరిస్తోందని, ఈక్రమంలో అప్రమత్తంగా సూచించారు. ఈమేరకు కపిల్ హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో గురువారం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ అనుమానిత వ్యక్తులు తారసపడితే 87126 85009, 87126 85123 నంబర్లకు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్సైలు రాజబాబు, దివ్య, ఏఎస్సైలు చంద్రమౌళి, రమేష్, హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, రాంచందర్ పాల్గొన్నారు.

దొంగల సమాచారం ఇవ్వాలి

హసన్‌పర్తి: నగరంలో ఉత్తర భారతదేశానికి చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సంచరిస్తున్నట్లు హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ తెలిపారు. ఈక్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇంటి యజమానులు జాగ్రత్తగా ఉండాలి

రామన్నపేట: ఉత్తర భారత్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా నగరంలో సంచరిస్తుందన్న సమాచారం మేరకు మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ టి.గోపి ఒక ప్రకటనలో సూచించారు. ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు, ఊర్లకు వెళ్లే సమయంలో పక్కింటి వారికి లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అలాగే అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు చేసి సమాచారం అందించాలని కోరారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి



నిరసన తెలుపుతున్న పలు సంఘాల బాధ్యులు

విద్యారణ్యపురి: కోల్‌కతాలోని జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యను నిందితులను కఠినంగా శిక్షించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కాళోజీ విగ్రహం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల బాధ్యులు మాట్లాడుతూ విద్యాసంస్థల్లో పిల్లలకు నైతిక విలువలు బోధించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రజాఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ పి.రమాదేవి, భారత్ బచావో చైర్మన్ రామబ్రహ్మం, అరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, అధ్యక్షుడు బూర భిక్షపతి, లాల్ నీల్ మైత్రి కన్వీనర్ కోగిల చంద్రమౌళి, చాగంటి కిషన్, వైట్ రిబ్బన్ సివిల్ సొసైటీ ఫోరం బాధ్యులు కవిరాజ్ ఇందిర, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, డీటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు అండగా మజ్దూర్ యూనియన్



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న శంకర్‌రావు

కాజీపేట రూరల్: రైల్వే కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం రైల్వే మజ్దూర్ యూనియన్ కృషి చేస్తోందని యూనియన్ కాజీపేట కోఆర్డినేటర్ నాయిని సదానందం అన్నారు. సికింద్రాబాద్‌లో మజ్దూర్ యూనియన్ సెంట్రల్ కార్యాలయంలో జనరల్ సెక్రటరీ సీహెచ్.శంకర్‌రావు సమక్షంలో కాజీపేట ఎలక్ట్రిక్ లోకోషెడ్ సంఘ్ బ్రాంచ్ ట్రెజరర్‌గా కొనసాగిన స్వర్ణకుమారి, సభ్యురాలు నాగమణి, మహిళా కార్మికులు యూనియన్‌లో చేరారు. కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ రవీందర్, కాజీపేట బ్రాంచ్‌ల చైర్మన్లు పాశం రాజు, రాజేందర్, డి.శ్రీనివాస్‌యాదవ్, ఆర్.సమ్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘అమ్మ కోసం చెట్టు’



మొక్క నాటుతున్న జెడ్పీసీఈఓ, తదితరులు

హసన్‌పర్తి: ప్రతిఒక్కరూ అమ్మ కోసం చెట్టును పెంచాలని హనుమకొండ జిల్లా పరిషత్ సీఈఓ విద్యాలత పిలుపునిచ్చారు. అమ్మకోసం - చెట్టు కార్యక్రమంలో భాగంగా హసన్‌పర్తి మండలం పెంబర్తిలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరు తమ తల్లితో కలిసి ఆమె పేరుమీద మొక్క నాటాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి ప్రవీణ్, మండల పంచాయతీ అధికారి కర్ణాకర్‌రెడ్డి, ఏపీఓ విజయలక్ష్మి, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి హేమలత, కారోబార్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రభావం లేని వైద్యం ఆయుర్వేదం

హన్మకొండ అర్బన్: ఎలాంటి దుష్ప్రభావం లేని వైద్యం ఆయుర్వేదమని, అనాదిగా తమ పూర్వీకులు విశ్వసిస్తున్న అన్ని వైద్య శాస్త్రాలకు మూలం ఈ ఆయుర్వేదమేనని సాయిబాబా మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ వివరించారు. నగరంలోని ఏషియన్ మాల్ సమీపంలోని సాయిబాబా మందిరంలో కపిల్ ఆయుర్వేద చికిత్సాలయ ఆధ్వర్యంలో భక్తులకు గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జోత్స్న హాజరై భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. మందిర ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, రాకం సదానందం, వెయ్యిగండ్ల రమేష్, డాక్టర్ పూస సురేష్‌కుమార్, కపిల్ సిబ్బంది మహేందర్‌రెడ్డి, సునీత, రమేష్ పాల్గొన్నారు.